రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



సికింద్రాబాద్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కే.కోటేశ్వర్‌రావు కథనం ప్రకారం... బొల్లారం–గుండ్ల పోచంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గల రైల్వే ట్రాక్ పక్కన ఒక వృద్ధుడు గాయపడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. అంబులెన్స్‌ను రప్పించిన పోలీసులు గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి అంబులెన్స్ చేరే సరికే వృద్ధుడు మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. మృతుడి వివరాలు పోలీసులకు లభించలేదు. వద్ద ఈనెల 15న అక్కన్నపేట నుంచి గుండ్లపోచంపల్లి, 16న గుండ్ల పోచంపల్లి నుంచి సికింద్రాబాద్, అదే రోజు సాయంత్రం సికింద్రాబాద్ నుండి గుండ్ల పోచంపల్లికి తీసుకున్న ట్రైన్ టికెట్లు మాత్రమే లభించినట్టు పోలీసులు తెలిపారు. అతడికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుడి ఒంటిపై తెల్లని పంచె, చొక్కా ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడిని గుర్తిస్తే ఫోన్ నం. 87126 58581, 96662 80808కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



ఇందిర(ఫైల్)

చిలకలగూడ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్‌బాగ్ ఎస్‌ఎండీసీ కాలనీకి చెందిన నీలగిరి ప్రసాద్, ఇందిర భార్యభర్తలు. 17 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి భవ్యశ్రీ, పురంజయ ఇద్దరు పిల్లలు. ప్రసాద్ చిలకలగూడ ఎరుకలబస్తీలో బేబీ ఫ్యామిలీ క్లినిక్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 13వ తేదీన ఇందిర తన భర్తకు భోజనం తీసుకుని క్లినిక్‌కు వచ్చింది. సాయంత్రం వరకు అక్కడే ఉన్న ఇందిర భర్త ప్రసాద్‌తో గొడవ పడింది. సెల్‌ఫోన్ క్లినిక్‌లోనే వదిలేసి బయటకు వెళ్లిపోయింది. మల్కాజిగిరిలోని ఇంటికి రాకపోవడంతో ఇందిర తల్లి మల్లీశ్వరి గురువారం పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

మరో ప్రాంతంలో యువతి..



శృతి(ఫైల్)

సనత్‌నగర్: పెద్దమ్మ వాళ్ల ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం..ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్ కు చెందిన పురుషోత్తం కుమార్తె శృతి (17) ఈ నెల 16న మధ్యాహ్నం 12 గంటల సమయంలో పెద్దమ్మ వాళ్ల ఇంటికి వెళ్తున్నానని స్కూల్ బ్యాగ్‌లో బట్టలు సర్దుకుని వెళ్లింది. అటు పెద్దమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి



అమీర్‌పేట: ఆసుపత్రిలో చికిత్స పొందుతు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న ఓ ప్రైవేట్ ఆసుపత్రి సమీపంలో ఓ వ్యక్తి అనారోగ్యంతో పడి ఉండటాన్ని గమనించిన పోలీసులు గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

24గంటల్లోనే మైనర్లను తీసుకొచ్చిన పోలీసులు

రసూల్‌పురా: ఫోన్ ఎక్కువగా వినియోగిస్తున్నాడని తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఇద్దరు మైనర్లను కార్ఖానా పోలీసులు 24 గంటల్లో వారి ఆచూకీ తెలుసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మడ్‌ఫోర్ట్‌లో నివాసం ఉంటున్న షిర్లీ డిక్రూజ్ కుమార్ (17), కుమారుడు (11) ఈ నెల 14న తల్లి మందలించడంతో ఇంటి నుంచి ఉదయం 11.50 గంటలకు బయటికి వెళ్లారు. అదే రోజు రాత్రి షిర్లీ కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామకృష్ణ నేతృత్వంలో ఎస్సై రవికుమార్ పర్యవేక్షణలో బృందం సీసీ పుటేజీలను పరిశీలించి నల్లగొండలో స్నేహితురాలు ఇంట్లో ఉన్నట్లు ఆచూకీ తెలుసుకుని నగరానికి తీసుకొచ్చారు. మైనర్ల ఆచూకీని 24 గంటల్లో కనుగొన్న పోలీసులను నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాల్ అభినందించారు.

ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టడమే లక్ష్యం

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్
- 27న అన్ని డివిజన్లు గులాబీమయం కావాలని ఆదేశం
- బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో కార్యకర్తలకు పలు సూచనలు



నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు అప్రమత్తం కావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 27న అన్ని డివిజన్‌లలో గులాబీ తోరణాలు ఏర్పాటు చేసి, జెండాలు ఎగురవేయాలన్నారు.

సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి..

అనంతరం నాయకులు, కార్యకర్తలు, అన్ని అనుబంధ సంఘాల ప్రతినిధులు వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. పదిలక్షల మందితో వేడుకలు నిర్వహించాలని పార్టీ అధిష్టానం భావిస్తోందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కూడా పెద్దసంఖ్యలో కార్యకర్తలు, జనం తరలి రావాలని కోరారు.

16నెలల పాలనలోనే ప్రజలు విసిగిపోయారు..

పదహారు నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు పట్ల అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని చెప్పారు. ఎన్నికల హామీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరాటంక పోరాటాలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పద్మారావుగౌడ్ కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్న లక్ష్మి, సామల హేమ, బీఆర్ఎస్ నేతలు ఆలకుంట హరిబాబు, కరాటే రాజు, లింగాని శ్రీనివాస్, కంది నారాయణ, గుర్రం పవన్ కుమార్ గౌడ్, సుంకు రాంచందర్, బోళ్ల సుమిత్‌యాదవ్, రాజ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ రజతోత్సవ సభకు కదలి రావాలి

పద్మారావునగర్: వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జి.పవన్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. పద్మారావునగర్‌లో జరిగిన బీఆర్ఎస్ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఆత్మగౌరవం పేరిట పుట్టిన టీఆర్ఎస్ పార్టీ ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనల అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 16నెలల పాలన కాలంలో రాష్ట్రంలో అనేక సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందని ఆరోపించారు. వరంగల్‌లో నిర్వహించే సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ప్రజలను సమీకరించాలని కోరారు. బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు వెంకటేషన్‌రాజు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఏసూరి మహేష్, పుష్పంత్‌రెడ్డి, మహేందర్, జగ్గయ్య, వెంకటరమణ, శ్రీకాంత్‌రెడ్డి, అనిత, నాగలక్ష్మీ, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేద్దాం..

అమీర్‌పేట: వరంగల్ జిల్లా జరుగనున్న బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభను అందరం కలిసి విజయవంతం చేద్దామని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి అన్నారు. గురువారం అమీర్‌పేట డివిజన్ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు 27 జరిగే రజతోత్సవ సభకు అమీర్‌పేట డివిజన్ నుంచి భారీగా తరలివెళ్లేలా కృషి చేయాలని తెలిపారు. ప్రయాణ వివరాలను నాయకులు, పార్టీ కార్యకర్తలకు వివరించాలని కోరారు.ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు హనుమంత్ రావు,సీనియర్ నేతలు అశోక్‌యాదవ్,కూతురు నర్సింహ,కట్ట బలరాం, దాడి ప్రవీణ్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్, ప్రకాష్‌గౌడ్, సంతోష్, హరిసింగ్, లక్ష్మి, సుమిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సంబరాలను విజయవంతం చేద్దాం

సనత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను విజయవంతం చేద్దామని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆవిర్భావ సంబరాల నిర్వహణపై బేగంపేట డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం సాయంత్రం ఆమె సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ నెల 27న కనీవినీ ఎరుగని రీతిలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను పార్టీ అధిష్టానం నిర్వహించబోతుందన్నారు. అందులో భాగంగా ఆ రోజు డివిజన్‌లో సంబరాలు నిర్వహించిన అనంతరం వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజోత్సవ సభకు తరలివెళ్లనున్నట్లు చెప్పారు. చలో వరంగల్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీహరి, డీవీ నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, అఖిల్ అహ్మద్ పాల్గొన్నారు.

నేడు సనత్‌నగర్‌లో సిలువ ర్యాలీ

అమీర్‌పేట: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని సిలువ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. ఇమ్మాన్యుయేల్ చర్చి నుంచి సనత్‌నగర్ బస్టాండ్, డీమార్ట్, జెక్‌కాలనీ, ఈ సేవా, మార్కెట్, బీకేగూడ మీదుగా ర్యాలీ సాగుతుందన్నారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



అడ్డగుట్ట: వేసవి కాలంలో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని అసిస్టెంట్ లేబర్ అధికారిని నిష్మిత అన్నారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ సహకారంతో గురువారం తుకారాంగేట్ లేబర్ అడ్డా వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్మిక శాఖకు చెందిన వివిధ సర్కిళ్ల అధికారులు హాజరై చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మయూరి, జ్యోతి, అబ్దుల్, సీఐటీయూ నాయకులు ఆర్. మల్లేష్, రమ, గోపాల్, రాజ్యలక్ష్మి, రాము, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తా



కుమార్‌యాదవ్ సత్కరించి అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్: గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం సనత్‌నగర్ అధ్యక్షుడిగా బన్సీలాల్‌పేట్ ప్రాంతానికి చెందిన గెలుబోయిన కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం ప్రతినిధులు వెంకటేష్‌యాదవ్, సలెంద్ర శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణయాదవ్ తదితరులు సమావేశమైన సనత్‌నగర్ అధ్యక్షుడిగా కుమార్ యాదవ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... యాదవ కులస్తుల అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు. యాదవ కులం గర్వపడే విధంగా పలు కార్యక్రమాలతో ముందుకు సాగుతానన్నారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సంఘం గౌరవ ప్రతిష్టలను ఇనుమడింపజేసే విధంగా పని చేస్తానని చెప్పారు.

కుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యే అభినందనలు

గ్రేటర్ హైద్రాబాద్ యాదవ్ సంఘం సనత్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా ఎన్నికైన గెలుబోయిన కుమార్‌యాదవ్‌ను గురువారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. కుమార్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి యాదవుల అభివృద్ధికి మంచిగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, అరుణ్‌గౌడ్, కె. దేవేందర్, విజయ్ శంకర్, ఎస్. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ శిక్షణ కేంద్రంలో ఎమ్మెల్యే తనిఖీలు



సెట్విన్ కేంద్రంలో శిక్షణ తీరును తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ గురువారం ఆకస్మికం తనిఖీ చేశారు. బ్యూటీషియన్, కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. అక్కడి విద్యార్థులు, ఫ్యాకల్టీలతో మాట్లాడి శిక్షణలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణా కేంద్రాన్ని రాష్ట్రంలోనే మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న భవనంపై మరో రెండు అంతస్తుల్లో భవన సముదాయాన్ని నిర్మిస్తున్నామన్నారు. త్వరలో పనులు పూర్తిచేసి కొత్త ట్రేడ్‌లలో శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఐదేళ్ళ క్రితం ఇక్కడ నెలకొల్పిన సెట్విన్ శిక్షణా కేంద్రం వందలాది మందికి ఉపాధి బాటలు వేస్తుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభాదేవికి డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థినీ చెరుకు ప్రభాదేవికి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు ప్రొ.వీబీ నరసింహ పర్యవేక్షణలో ఐడెంటిటి అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్ ఇన్ పబ్లిక్ క్లౌడ్ ఫ్రేమ్ వర్క్స్ అనే అంశం పై పరిశోధనకు గాను డాక్టరేట్ డిగ్రీ లభించినట్లు పేర్కొన్నారు. పరిశోధనలకు సహకరించిన వారికి డా.ప్రభాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపకుల అరెస్టును ఖండిస్తున్నాం: టీఎంవీఎఫ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్, భద్రత ఇతర డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేపట్టిన కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తెలంగాణ మహిళ విద్యావంతుల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు డా.స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి తల్లమల్ల శ్వేత హస్సెన్ తీవ్రంగా ఖండించారు. గురువారం చలో సెక్రటేరియట్, గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమాలను చేపట్టిన సుమారు 1200 మంది అధ్యాపకులను అరెస్ట్ చేసి 13 పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం దారుణమన్నారు. మహిళలని కూడా చూడకుండా మండుటెండలో అరెస్ట్ చేసి ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమన్నారు. మహిళలకు అనేక పథకాలు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యావంతులైన మహిళా అధ్యాపకులను బలవంతగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు.

బీజేపీవి విడగొట్టే రాజకీయాలు

కంటోన్మెంట్: బీజేపీ కుల, మత రాజకీయాలు చేస్తూ దేశాన్ని విడగొడుతోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్లో వడ్డెర బస్తి నుండి అంబేద్కర్ నగర్ వరకు 'జై బాపూ.. జైభీమ్.. జై సంవిధాన్ అభియాన్'ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాతతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేశ్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి బీజేపీ విధానాలను ప్రజలకు వివరించి చైతన్య పరుస్తామని అన్నారు. ఇప్పటికే కంటోన్మెంట్ పరిధిలోని ఆరు వార్డులు, మోండా డివిజన్ పరిధిలో చేపట్టిన ర్యాలీలు విజయవంతం అయ్యాయి. మిగతా వార్డుల్లోనూ ర్యాలీలు నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి బీజేపీ దురాగతాలను ఎండగడతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బద్రీనాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



జై బాపూ.. జై భీమ్.. జై సంవిధాన్ ర్యాలీలో ఎమ్మెల్యే శ్రీగణేశ్, కాంగ్రెస్ నేతలు

అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్

సనత్‌నగర్: ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా వ్యవహరించాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సురక్షితంగా ఎలా బయట పడాలి.. ప్రమాద బాధితులను ఏవిధంగా బయటకు తీసుకురావాలనే తదితర అంశాలపై అగ్నిమాపక శాఖ అధికారులు అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు చోటుచేసుకునే సంఘటనలను ప్రయోగాత్మకంగా చూపించి వైద్యులకు, సిబ్బందికి అవగాహన కలిగించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ ఫైర్ ఆఫీసర్ పూర్ణకుమార్ నేతృత్వంలో లీడింగ్ ఫైర్‌మెన్ రాజు ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా మేనేజ్‌మెంట్ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆస్పత్రి ఫ్లోర్లను ఫైర్ కంపార్ట్‌మెంట్స్‌గా విభజించి, అగ్ని ప్రమాదాలు వ్యాపించకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. స్మోక్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి 5 సంవత్సరాలకు ఎలక్ట్రికల్ వైరింగ్/ ఎంసీబీ/ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు లైసెన్స్‌డ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్‌తో పరీక్ష చేయించుకుని అవసరమైన మార్పులు చేయాలన్నారు. ఫైర్ అలారం విన్న వెంటనే భవనాన్ని ఖాళీ చేయాలని... ఎవరి ఆదేశాల కోసం ఎదురుచూడవద్దని చెప్పారు. ఆస్పత్రుల్లోని బేస్‌మెంట్లలో మంచాలు, పరుపులు, ఇతర ఫర్నిచర్ లాంటి వాటిని నిల్వ చేయకూడదని వివరించారు.

ఓటరు నమోదుకు మళ్లీ అవకాశం

సికింద్రాబాద్: ఓటరు నమోదు కార్యక్రమానికి సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 ఏళ్ల వయసు నిండిన యువతీయువకుల పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు చేయించేందుకు ఈనెల మొదటి వారం నుంచి జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్లలో యువతీ యువకులను గుర్తించడం, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం కోసం అవగాహన కల్పించాల్సిన అంశాల పట్ల జీహెచ్ఎంసీ అధికారులు బూత్‌లెవల్ అధికారులు, పర్యవేక్షకులకు ఇప్పటికే సలహాలు సూచనలు చేశారు.

- ఈ ఏడాది జనవరిలో అధికారులు తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. పలు పర్యవేక్షణలు, వడబోతల అనంతరం నియోజకవర్గంలో పురుషులు 133918, మహిళలు 134706, ఇతరులు 29 మొత్తంగా ఓటర్లు 268716 మంది ఉన్నట్టు పేర్కొన్నారు. గతంలో ఏడాదిలో ఒక్కసారి మాత్రమే ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగేది. ఎన్నికల కమిషన్ అధికారులు సవరించిన నిబంధనల ప్రకారం నాలుగు సార్లు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
- 18 సంవత్సరాలు నిండిన వారితోపాటు తాజాగా విడుదల చేసిన ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారు, చిరునామా మార్పు, తప్పొప్పుల సవరణలకు సంబంధించిన దరఖాస్తులు చేసుకోవచ్చునని ఎన్నిక అధికారులు చెబుతున్నారు. అర్హులైన యువతీ యువకుల అందరి పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు చేయించడంతోపాటు, పర్యవేక్షకుల పరిశీలన సమయంలోనే ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజెప్పేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుడి రిమాండ్

- పరారీలో మరొకరు
- 12.5 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి రవాణా తీరును వివరిస్తున్న జీఆర్పీ డీఎస్పీ జావెద్, ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్: బరంపూర్–దాదర్‌కు రైలు ప్రయాణం ద్వారా గంజాయి రవాణా చేస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ.6.19 లక్షల విలువ చేసే 12.5 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు సూత్రధారిగా ఉన్న ప్రధాన నిందితుడు పోలీసుల కదలికలు పసిగట్టి పారిపోయాడు. జీఆర్పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన మున్నానాయక్ (29), సమీరాబిషోరాయ్ (31) స్నేహితులు. ఇరువురు మహారాష్ట్రలోని ఒకే కంపెనీలో సేల్స్‌బాయ్స్‌గా పనిచేసేవారు. వేతనం తక్కువగా ఉండడంతో మున్నానాయక్ ఉద్యోగం వదిలేసి సొంతూరికి వెళ్లిపోయాడు. మహారాష్ట్రలోనే ఉంటూ గంజాయి రవాణా చేసే వ్యాపారులతో సమీరాబిషోరాయ్ సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. కొద్ది రోజుల తరువాత ఒడిశాకు వచ్చి మున్నానాయక్‌ను కలిసి తనకు సహకరిస్తూ గంజాయి రవాణా చేస్తే ఒక్కో ట్రిప్పుకు రూ.10వేలు ఇస్తానని చెప్పాడు. అసలే ఆర్థిక సమస్యల్లో ఉన్న మున్నానాయక్ గంజాయి రవాణాకు అంగీకరించాడు. రెండు మార్లు సరఫరా చేసినందుకు గాను మున్నానాయక్‌కు రూ.22 వేలను సమీరాబిషోరాయ్ చెల్లించాడు.

- తాజాగా సమీరాబిషోయ్‌తో కలిసి గంజాయి ప్యాకెట్లు వెంట తీసుకున్న మున్నానాయక్ బరంపూర్ రైల్వేస్టేషన్ నుంచి దాదర్ వెళ్లేందుకు బయలుదేరి 17న ఉదయం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు.ఇక్కడి నుంచి దాదర్ వెళ్లేందుకు 6వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు రాకకోసం వేచి చూస్తున్న వారికి పోలీసుల తనిఖీలు కనిపించాయి. గంజాయితో కూడిన లగేజీని ప్లాట్‌ఫామ్ పైనే వదిలేసిన వారు బయటికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం సమయంలో ఇరువురు నిందితులు తిరిగి రైల్వేస్టేషన్‌కు చేరుకుని 6వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చి వారి లగేజీ అక్కడే ఉండడాన్ని గమనించారు. లగేజీ బ్యాగు తీసుకుని రమ్మని మున్నానాయక్‌ను పురమాయించిన సమీరాబిషోరాయ్ కొద్ది దూరంలో ఉండి పరిస్థితిని గమనిస్తూ ఉన్నాడు. సదరు అనుమానాస్పద లగేజీపై కన్నేసి ఉంచిన జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు మున్నానాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇదంతా గమనించిన సమీరాబిషోరాయ్ స్టేషన్ నుంచి పారిపోయినట్టు పోలీసులు తెలిపారు. మున్నానాయక్‌ను రిమాండ్‌కు తరలించిన పోలీసులు మొదటి ముద్దాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కేంద్ర ప్రభుత్వానివి కక్ష సాధింపు చర్యలు

కంటోన్మెంట్: దేశంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. గురువారం నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఈడీ చార్జిషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ ఈడీ ఆఫీసు ముట్టడికి పికెట్‌లోని క్యాంపు కార్యాలయం నుంచి భారీ ర్యాలీతో బయలుదేరారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు పికెట్‌లో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు గుమిగూడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సిబిఐలను కేంద్ర ప్రభుత్వం ఆయుధాలుగా వాడుతోందన్నారు. గత పదేళ్లలో ఈ సంస్థలు పెట్టిన కేసులు గమనిస్తే 95 శాతానికి పైగా కేసులు కేవలం ప్రతిపక్షాలు, బీజేపీయేతర పార్టీల వారి పైనే నమోదు చేసిందన్నారు. బీజేపీని ప్రశ్నిస్తే కేసులు పెడుతోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన పనులు గురించి చెప్పుకోవడానికి ఏమీ లేక ప్రజలను సమస్యల నుంచి డైవర్ట్ చేయడం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీకి బయలుదేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ నేతలు బద్రీనాథ్ యాదవ్, ఆనంద్, నాగినేని సరిత, సంతోష్ యాదవ్, వినోద్, బంగారు సదా, నరేశ్ ముదిరాజ్, మురళీ ముదిరాజ్, ఇటుక గోపీ తదితరులున్నారు.

అమీర్‌పేట నాయకుల నిరసన

అమీర్‌పేట. కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జిషీట్‌లో చేర్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఈడీ కార్యలయం వద్ద చేపట్టిన నిరసనలో అమీర్‌పేట నాయకులు రాజరాజేశ్వరి, కటకం భాస్కర్, సత్యనారాయణ యాదవ్, దీపక్, రజనీకాంత్, ప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నిజమే విజయం సాధిస్తుంది: కోట నీలిమ

సనత్‌నగర్: టీపీసీసీ ఆధ్వర్యంలో ఈడీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఏఐసీసీ సభ్యురాలు, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ ధర్నాలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తమ నాయకులను లక్ష్యంగా చేసుకునే ముందు దేశవ్యాప్తంగా లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. నిజమే విజయం సాధిస్తుందని అన్నారు. తమ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై బురదజల్లే ప్రయత్నాలను తిప్పికొడతామని అన్నారు.



ఈడీ కార్యాలయం ముట్టడికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ నేతృత్వంలో ర్యాలీగా బయలుదేరిన కాంగ్రెస్ నేతలు



ఈడీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న కోట నీలిమ